www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 ఏప్రిల్ 2025

5

తిరుపతి



తుడ టవర్స్ వాణిజ్య గదుల వేలం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని మే 8,9, తేదీల్లో ఈ వేలం నిర్వహించనున్నట్లు తుడా ఉపాధ్యక్షులు మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరముల స్థలంలో "తుడ టవర్స్" నిర్మిస్తున్న విషయం విదితమే. ఇందులోని నివాసయోగ్యమైన గదులకు వేలం నిర్వహించామని తెలిపారు. తుడ టవర్స్ (గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8, 9 తేదిల యందు ఈ - వేలం ద్వారా అమ్ముటకు నిర్ణయించామని తెలిపారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనవిగా నిర్మిస్తున్నామని తెలిపారు. వివరముల కొరకు తుడ కార్యాలయము, తుడ టవర్స్ వెబ్సైట్లు డబ్ల్యూ డబ్ల్యూ తుడా టవర్స్ డాట్ ఇన్ /డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ తుడా యాప్ డాట్ ఇన్ సంప్రదించవలసినదిగా ఆ ప్రకటనలో కోరారు.

స్వర్ణముఖిలో.. ఇసుక తోడేళ్లు

- యంత్రాలతో యధేచ్ఛగా తవ్వకాలు

దోపిడీకి గురవుతున్న ఇసుక.. అధికారుల కళ్లకు మసక..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్వర్ణముఖి నదిలో ఇసుక తోడేళ్లు చెలరేగిపోతున్నాయి. అడ్డుకట్ట వేసే వారే లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ.. పగలూ, రాత్రి అన్న తేడా లేకుండా భారీ యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను ఆదుకోవాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ప్రభుత్వ యంత్రాంగాన్ని, నాయకులను పలుమార్లు ఆదేశిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. 'కంచే చేను మేసింది' అన్న చందాన ఇసుక మాఫియాకు అధికార యంత్రాంగం, అధికార పార్టీ నేతల అండ ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఫలితంగా చంద్రగిరి నుంచి వాకాడు వరకు స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

రోడ్లు వేసుకునీ మరి!

స్థానిక అవసరాలకు ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో తరలించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. యంత్రాల సాయం లేకుండా కూలీలతోనే తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే ఇసుకాసురులు స్వర్ణముఖి నదిలోకి భారీ వాహనాలు సైతం వెళ్లేలా రోడ్లు వేసుకుని మరీ జెసిబిలతో తవ్వకాలు చేపడుతున్నారు. ఏర్పేడు, పాపానాయుడుపేట, రామాపురం, పెన్నలపాడు, విరూపాక్షపురం, పెద్ద కనపర్తి, పుల్లూరు, పెళ్లకూరు, ఓజిలి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి అన్న ఆరోపణలు ఉన్నాయి. మాఫియాకు రాజకీయ పరపతి ఉండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నదిలో పగలు రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాల్లో డంప్ చేసి అక్కడి నుంచి లారీలతో చెన్నై తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డంపింగ్ కేంద్రాలకు ఇసుక రవాణా చేసిన ట్రాక్టరుకు రూ.700 నుంచి రూ.1,700 చెల్లించి, అదే ఇసుకను రూ.3 వేలు నుంచి రూ.5 వేలతో విక్రయిస్తున్నట్లు సమాచారం.

అడ్డుకుంటాం: భాను ప్రకాష్ రెడ్డి, ఆర్డీవో, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని స్వర్ణముఖి నది వెంబడి యంత్రాల సాయంతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లుగా సమాచారం అందింది. ఎక్కడికక్కడ రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని పంపి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటాం. ఇసుకను స్థానిక అవసరాలకు కాకుండా వ్యాపార నిమిత్తం తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నియోజకవర్గం వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సమక్షంలో భారీగా కేకులు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పనిచేస్తున్న పారిశుధ్య విభాగ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఏరియా ఆసుపత్రి రోగులకు పండ్లు పంచిపెట్టారు. వెయ్యి మందికి అన్నదానం చేశారు. బీసీ బాలికల వసతి గృహం నందు నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ ను బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ డాక్టర్ నివేదితా మోరే ఉమేష్ రావు ఆధ్వర్యంలో జయరామరావు నందు ప్రత్యేక ప్రతిభవంతులు కేక్ కట్ చేసి నారా చంద్రబాబునాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునిల్ కుమార్ కేక్ కట్ చేసి, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు.ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు9 కార్వేటి నగర్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, టీడీపీ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: చంద్రబాబు నాయుడు 75 వ జన్మదిన వేడుకలు మండలంలోని ఉదయమాణిక్యం గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తనాని ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - పిచ్చాటూరు: చంద్రబాబు జన్మదినాన్ని పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మిస్టర్ గోల్డెన్ తమిళనాడు ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా గోల్డెన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేసి పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణజాస్ ఇంటర్నేషనల్ ఈ పోటీల్ని స్పాన్సర్ చేయడం చాలా సంతోషమని, మెన్స్ బాడీ బిల్డింగ్ ఉమెన్స్ బాడీ బిల్డింగ్ మెన్స్ క్లాసిక్ ఫిజిక్ మెన్స్ ఫిజిక్ మోడలింగ్ మెన్ మోడలింగ్ విమెన్‌తో పాటు 55, 60, 65, 70, 75, 80, 85, 90, 90 కేజీల పైబడిన కేటగిరిలకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రనోజాస్ ప్రోడక్ట్‌ని ఆవిష్కరించారు. మెన్స్ ఫిజిక్, మెన్స్ క్లాసిక్ ఫిజిక్ వివిధ వెయిట్ కేటగిరిలతో పాటు మెన్ ఫిజిక్ విమెన్ ఫిజిక్ మెన్ మోడలింగ్ విమెన్ మోడలింగ్ తదితర అంశాలలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు బహుమతులుగా వివిధ కంపెనీల కారులను వివిధ కంపెనీల మోటార్ సైకిల్స్‌ను, అత్యధిక క్యాష్ ప్రైసెస్ బహుమతులుగా ప్రకటించడంతో అనూహ్య స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో గోల్డెన్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి వి బాబు, మాజీ మిస్టర్ ఇండియా మునియప్పన్, కోశాధికారి దినేష్ కుమార్, కే సురేష్, అనూజ్ సోనీ, నిశర్బాన్, సత్యం బిజీ బాబు, అఖిల్ బాబు, గౌరీ శంకర్, ఆర్ బి సురేష్ బాబు, ఆర్ షణ్ముగం, దినేష్ కుమార్, లక్ష్మీ పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయించండి

జనసేన పార్టీ కోట వినుతకు వినతి పత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధ దేవాలయమైన అర్ధనారీశ్వరాలయంలో ఉచిత సేవ చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు న్యాయబద్ధమైన జీతాలు అందేలా చొరవ చూపాలంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్చార్జి కోట వినుతను ఆదివారం నాయీ బ్రాహ్మణులు కోరారు. ఈ ఆలయంలో 6 మంది నాయీ బ్రాహ్మణులు వాయిద్య కళాకారులుగా ఎన్నో ఏళ్ల తరబడి ఉచిత సేవ చేస్తున్నట్లు వారు తెలిపారు. అయితే దేవదాయ శాఖ నుంచి తమకు వేతన రూపంలో సాయం అందడం లేదని వాపోయారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. వినుత సానుకూలంగా స్పందించారు.

తిరుమల ఘాట్‌లో కారు దగ్ధం.. భక్తులు క్షేమం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల రెండోవ ఘాట్ రోడ్డులో ప్రమాదం తప్పింది. శ్రీవారి దర్శనార్థం తిరుపతి నుంచి తిరుమలకు ప్రయాణిస్తున్న భక్తులు కారులో మంటలు చెలరేగాయి. భాష్యంగార్ల సన్నిధి మలుపు వద్ద ఘటన చోటు చేసుకుంది. అప్రమత్తమై డ్రైవరు, భక్తులు కారును రోడ్డు ప్రక్కకు ఆపి పరుగులు తీసారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. భక్తులు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం గ్రామానికి చెందిన వారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది.

పోలీసుల అదుపులో ఆకతాయిలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామపంచాయతీ, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలలో ఆదివారం సాయంత్రం ఆకతాయిలను అదుపులోకి తీసుకొని పోలీసులు డిఎస్పి ముందు సరెండర్ చేశారు. ఎస్సై జగన్నాథం తెలిపిన వివరాల మేరకు సప్తగిరి కాలనీ, రణధీరపురం పంచాయతీలలో స్థానికంగా ప్రజలకు ఆకతాయిల వలన ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరందరికీ కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

దర్శన టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులు

నిర్దేశిత సమయంలోనే రావాలి

సర్వ దర్శన క్యూలైన్లలను, అన్న ప్రసాద వితరణను పరిశీలించిన అదనపు ఈవో

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శన టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయంలోనే దర్శన క్యూలైన్లలోకి ప్రవేశించాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి కోరారు. తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో ఆదివారం రాత్రి ఆయన సర్వ దర్శన క్యూలైన్లను పరిశీలించారు. టీబీసీ, ఏటీసీ వద్ద క్యూలైన్లలో భక్తులకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. క్యూలైన్లలోని భక్తులకు సౌకర్యవంతంగా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ప్రారంభించిన మొబైల్ ఫుడ్ వెహికల్స్‌ను ఆయన పరిశీలించి భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్న ప్రసాదాలు అందించాలని అధికారులను ఆదేశించారు. క్యూ లైన్ లో టీటీడీ కల్పించే సౌకర్యాలపై భక్తుల నుండి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవులు, వారంతపు సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉందని చెప్పారు. నూతనంగా ప్రారంభించిన మొబైల్ ఫుడ్ వెహికల్స్ ద్వారా భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు అందిస్తున్నామని తెలిపారు. సర్వ దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులకు ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో దర్శనాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, క్యాటరింగ్ అధికారి శాస్త్రి అధికారులు పాల్గొన్నారు.

క్యాంటీన్ టెండర్లు రద్దు చేయండి

సంపూర్ణ క్యాంటీన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్నపూర్ణ, సంపూర్ణ అని రెండు క్యాంటీన్లు విద్యార్థులు, వర్సిటీలో పనిచేసే బోధనా సిబ్బంది కొరకు ఏర్పాటు చేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో క్యాంటీన్ల టెండర్లను రద్దు చేయాలని కోరుతూ నిర్వాహకులు సిఫారసు లేఖను వర్సిటీ ఉన్నతాధికారులకు ఇచ్చినట్లు సమాచారం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో నిరుపేద విద్యార్థులు ఎంతో ఉన్నతమైన ఆశలతో ఉన్నత చదువుకోవాలని ఇక్కడికి వస్తారు. విద్యార్థి ఆర్థిక పరిస్థితులు కనుగుణంగా వర్సిటీలోని రెండు క్యాంటీన్‌ల ధరలను అతి తక్కువ ధరకు వర్సిటీ నియమ, నిబంధనల మేరకు పరిమిత వస్తువులు మాత్రమే విద్యార్థులకు అమ్మడానికి అనుమతి ఇస్తారు. వీటన్నిటికి సమ్మతించి వర్సిటీలో టెండర్ దక్కించుకున్న వ్యక్తి నాణ్యత కలిగిన భోజనం, ఇతర వస్తువులు అందిస్తారు. వర్సిటీ ఆదాయం దృష్టిలో ఉంచుకొని అత్యధిక టెండర్ వేసిన వారికి రెండేళ్లకాల పరిమితికి క్యాంటీన్‌ను ఇవ్వడం జరుగుతుంది. గతంలో ఒక క్యాంటీన్ కి టెండర్ పూర్తి కాకుండానే అధికారులు మూసి వేయించి రెండు క్యాంటీన్లకి కొత్తగా టెండర్లను పిలిచారు. అయితే ఇక్కడ ఎంతోమంది విద్యార్థి సంఘాల నేతలు, బయట వ్యక్తులు క్యాంటీన్‌కి టెండర్లు వేయడం జరిగింది. క్యాంటీన్ టెండర్లు ఓపెన్ చేసి చూడగా 2 క్యాంటీన్లకు సంబంధించి టెండర్లు ఒకే వ్యక్తి చేజిక్కించుకోవడం జరిగింది. అన్నపూర్ణ కాంటీన్ నెలకి ఓ లక్ష ఇరవై తొమ్మిది వేల రూపాయల బాడుగతో, సంపూర్ణ క్యాంటీన్‌ను నెలకి 60 వేలకు పైగా బాడుగని చెల్లిస్తామని అత్యధిక టెండర్ వేసిన వ్యక్తి రెండు క్యాంటీన్లను దక్కించుకున్నారు. అయితే గత నాలుగు నెలలుగా క్యాంటీన్‌లో భోజనం క్వాంటిటీ, క్వాలిటీ సరిగా లేదని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అంతేకాకుండా అక్కడ పనిచేసే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంటీన్లో భోజనం కంటే వర్సిటీకి బయట ఉన్న మొదటి, రెండవ గేట్లలో నిర్వహించే టిఫన్ సెంటర్లు, భోజన కేంద్రాల్లో నాణ్యతతో పాటు ధర తక్కువగా ఉందని విద్యార్థులు, సిబ్బంది అక్కడికి వెళ్లడం అలవాటు చేసుకున్నారు. క్యాంటీన్‌కు సమీపంలో చికెన్ బిర్యాని 59 రూపాయలకి, వంద రూపాయలకి ఇవ్వడం పట్ల వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు ఆకర్షితులవడంతో క్యాంటీన్ వ్యాపారం పూర్తిగా జరగకపోవడంతో సదరు టెండర్ వేసిన వ్యక్తి క్యాంటీన్ ధరలు తగ్గించాలని వర్సిటీ

అన్నపూర్ణ క్యాంటీన్

ఉన్నతాధికారులకు వినతి చేసుకున్నట్లు వర్సిటీలో విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా చిన్న క్యాంటీన్ సంపూర్ణ క్యాంటీన్ మాత్రమే నిర్వహిస్తానని పెద్ద క్యాంటీన్ అయిన అన్నపూర్ణ కాంటీన్ నిర్వహించలేనని టెండర్ రద్దు చేయాలని అధికారులకు విన్నవించుకున్నట్లు సమాచారం. అయితే టెండర్ రద్దు చేయాలంటే కనీసం ఆరు నెలలు లేదా సంవత్సర కాలం పాటు బాడుగ కచ్చితంగా చెల్లించవలసి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై వర్సిటీ ఉన్నత స్థాయి అధికారుల కమిటీ నిర్ణయం తీసుకొనున్నట్లు వారు తెలిపారు. అత్యధిక టెండర్‌కి వేసిన వ్యక్తికే రెండు క్యాంటీన్లను నిర్వహణ అప్పజెప్పడం ద్వారా, ఇక్కడే చదువుకుంటూ పరిశోధన కొనసాగిస్తున్న విద్యార్థి సంఘాల నేతలకు అవకాశం కల్పించకుండా చేయడం దారుణమని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయట వ్యక్తులు ఎడ పెడగా అత్యధిక ధరలకు టెండర్ వేసి వ్యాపారం జరగలేదని బాడుగ తగ్గించాలని లేదా టెండర్ రద్దు చేయాలని కోరుకుంటే, వర్సిటీ నియమ, నిబంధనల ప్రకారం ఆరు నెలల బడుగు చెల్లించుకోవాలని, లేదంటే తాము ఒప్పుకోమని విద్యార్థి సంఘాల నేతలు బహిరంగంగాఁ తెలుపుతున్నారు.

దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులపై వినతిపత్రం ఇస్తామని విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు టెండర్ వేసే ముందుగానే ఖచ్చితమైన నియమ, నిబంధనల కాపీని అందరికీ ఇవ్వాలని, క్యాంటీన్ ధరలను కూడా డిస్ప్లేలో నిరంతరం ఉంచాలని, అంతకుమించి ఎక్కువ ధరలకు అమ్మితే భవిష్యత్తులో క్యాంటీన్‌కు టెండర్ వేసే అర్హతను పూర్తిగా రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు


చీకట్లో పాముల భయం..

చెత్త పేరుకుపోయిన కాలువ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మండలం, సోమసానిగుంట పంచాయతీ, బ్యాంక్ పాలెం, మరాఠీపాలెం, కాలనీల్లో గత కొద్ది రోజుల నుండి వీధిలైట్లు వెలగడం లేదు. సాయంత్రం ఆరు దాటితే కాలనీలు అంధకారంలో అలుముకుంటోంది. చుట్టుప్రక్కల నిమ్మ తోటలు ఉన్నందున విష కీటకాల బెడద ఎక్కువగా ఉన్నది. రాత్రి సమయాలలో ఈ గ్రామాల్లో నివాసాలు ఉంటున్న ప్రజలు తిరగాలంటే పాములకు భయపడుతున్నారు. వీధిలైట్లు వెలిగించి, విష సర్పాల బెడద నుండి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ గ్రామాల్లో సైడ్ కాలువలలో ముఖ్యంగా నీరు నిలిచి నెలల తరబడి క్లీన్ చేయక చెత్త కూరుకుపోయింది. దీంతో దోమల బెడద ఎక్కువైంది. నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోయారు. మురుగునీరు పారుదలకు ఏర్పాటు చేయాలని, గ్రామానికి బోరు దగ్గర అపరిశుభ్రంగా ఉందని, పరిశుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు రోజా పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, కృష్ణ సముద్రంలో విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన సుకన్య అనే మహిళ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా బాధితులను పరామర్శించారు. 25 కేజీల బియ్యం, నూనె, పప్పు వంటి నిత్యావసర సరకులు, 10 వేల రూపాయలు సహాయం అందించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీ జైన్ సేవా మండల్ వారి సహకారంతో చెన్నై మహా వీర్ క్లబ్ వారి 1200వ ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. తిరుపతి ఎస్ వి అరవింద్ కంటి హాస్పిటల్ వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్, కేతన్, ధర్మీ చంద్, సుభాష్, నితేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో జెవివి ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా మునిగిరిష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నాయుడుపేట: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం కోసం వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయని నాయుడుపేట అగ్నిమాపక ఇన్చార్జి కేంద్రాధికారి డి.వి రమణయ్య తెలియజేశారు. అగ్నిమాపక వారోత్సవాల చివరి రోజు నాయుడుపేట అగ్నిమాపక కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కేంద్రాధికారి డి.వి.రమణయ్య మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ ప్రజల ప్రాణ రక్షణకై ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ శాఖ అని, వారం రోజుల పాటు ప్రజలకు అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్ మాన్ అమరావతి చంద్రబాబు, ఫైర్‌మెన్‌లు ఏ.సందీప్, ఎం.నాగరాజు, కే.పోలయ్య, హెచ్.బాలాజీ, సుబ్రహ్మణ్యం, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు అగ్నిమాపక కేంద్ర అధికారి నేతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు

ఆదివారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఎఫ్ఓవి శివయ్య, సిబ్బంది లీడింగ్ ఫైర్ మాన్ విశ్వనాథ శెట్టి, ఎల్ ఎఫ్ నాగేశ్వరరావు, డ్రైవర్ ఆపరేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఫల సరుకులు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసరా పథకం ద్వారా 20మంది పేదలకు ఫలసరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమనికి దాతగా డాక్టర్ జనార్దన్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీకి రెడ్డి మధుసూదన్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, మండి శ్రీనివాసులు రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, జయపాల్ రెడ్డి, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషోద్యమ రారాజు సంగరాజు భాస్కర్ రాజు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తెలుగు భాషకు ఆదరణ తగ్గిపోతోందని, మాతృభాషను పట్టించుకునే వారు లేరని సాహితీ ప్రముఖులు చింతిస్తున్న తరుణంలో తిరుపతికి చెందిన సంగరాజు భాస్కరాజు నడుం బిగించి తనదైన శైలిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కేవలం 30 రోజుల్లోనే తెలుగు భాషపై పట్టు సాధించి, అనర్గళంగా చదవడం, రాయడం తెలుసుకుని, అత్యుత్తమ ప్రతిభను కనపరిచే విధి విధానాలను నేర్పిస్తున్నారు. రెండవ, మూడవ తరగతి చదివే బాల బాలికలు పదవ తరగతి పాఠ్యాంశాలను తప్పులు లేకుండా చదవగలుగుతున్నారు. సంగరాజు భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మేక్ మై బేబీ జీనియస్ నేతృత్వంలో ఇచ్చే శిక్షణ ద్వారా సులభంగా మాతృభాషపై పట్టు సాధించగలుగుతున్నారు. 18 స్టెప్స్ మెథడ్‌తో.. కొత్తగా రూపకల్పన చేసిన ఫోర్ స్టెప్ మెథడ్ కోడింగ్, డీ కోడింగ్ ద్వారా నెల రోజుల్లోనే, కేవలం 30 గంటల్లో తెలుగు చదవడం సులభంగా నేర్చుకోవచ్చు. ఈ పద్ధతిని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ కమిషనర్ సూచనల మేరకు 30 రోజుల్లోనే తెలుగు రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ, మున్సిపల్ స్కూల్లో దిగ్విజయంగా నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యాముల్ ముఖ్య అతిథిగా హాజరై బాల బాలికల పఠనా సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా చూసి అభినందించారు. ఈ పద్ధతులను రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తే విద్యా ప్రగతి సులభతరం అవుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తుండడం గమనార్హం.

➤ **సులువుగా చదివేస్తా...**

ముందు తెలుగు పాఠాలను కూడి కూడి చదివే వాడిని, సార్ ఇచ్చిన శిక్షణతో ఇప్పుడు సులభంగా చదువగలుగు తున్నాను. ఒత్తు పదాలు చాలా కష్టంగా ఉండేవి. ఇప్పుడు అవి చదవడం సులభతరమైంది.

-శరణ్ తేజ, ఐదవ తరగతి.

➤ **అనర్గళంగా చదివేస్తా...**

శిక్షణ తీసుకోక ముందు తెలుగు చదవాలంటే బెరుకుగా ఉండేది. నెల రోజుల శిక్షణ అనంతరం తెలుగు చక్కగా చదవకలుగుతున్నాను. ఎన్ని ఒత్తులు ఉన్న పదాలైనా, న్యూస్ పేపర్లైన సులభంగా చదివేస్తా. పెద్ద పెద్ద వాక్యాలను కూడా చూచిన వెంటనే చదవగలుగుతున్నాను.

-నవ్య శ్రీ నాలుగవ తరగతి

➤ **తెలుగు ఈజీగా ఉంది...**

తెలుగు రాయాలన్నా చదవాలన్నా చాలా భయంగా ఉండేది. ఈ సార్ దగ్గర శిక్షణ పొందిన తర్వాత తెలుగు ఇంత సులభమా అనిపిస్తోంది. తెలుగు ఏదైనా ఇప్పుడు చదివేస్తా. రాసేది కూడా సులభంగా ఉంది. ముందు తెలుగు పుస్తకం ఎత్తుకునేదాన్ని కాదు ఇప్పుడు తెలుగు అంటే మహా ఇష్టం.

-తనుశ్రీ మూడో తరగతి

➤ **మా అబ్బాయి బాగా చదువుతున్నాడు**

మావాడు తెలుగు అంటే భయపడేవాడు. నెల రోజులు ఏదో శిక్షణ అని మున్సిపల్ స్కూల్లో భాస్కర్ రాజు ద్వారా శిక్షణ పొంది ఇప్పుడు తెలుగు బాగా చదువుతున్నాడు. నెల రోజుల్లోనే ఇంత ఈజీగా తెలుగు చదవడం మాకు చాలా సంతోషంగా ఉంది.

-భారతి, విద్యార్థి తల్లి, సంజీవ్‌గాంధీ కాలనీ.

➤ **మా పాప న్యూస్ పేపర్ చదివేస్తోంది**

ముందు తెలుగు పుస్తకం కూడా చదివేదే కాదు. తెలుగంటే భయపడేది. ఇప్పుడు న్యూస్ పేపర్ కూడా ఈజీగా చదివేస్తోంది. ఎక్కువగా తెలుగు మీదే శ్రద్ధ చూపిస్తోంది. ఇప్పుడు చాలా సులభంగా ఉంది అని అంటుంది. భాస్కర్ రాజు ద్వారా శిక్షణ తీసుకున్న మా అమ్మాయి మాక్కూడా తెలుగు సులభంగా నేర్పిస్తోంది.

- రాజేశ్వరి, విద్యార్థి తల్లి, కొర్లగుంట.

➤ **మా పాప పెద్ద పదాలు కూడా ఈజీగా చదివేస్తుంది**



తెలుగు పదాలు చదవమన్నా.. రాయమన్న మా పాప చాలా ఇబ్బంది పడేది. దీనికి తెలుగే రాదు అనుకున్నాం. భాస్కర్ సార్ ఇచ్చిన శిక్షణతో మా పాప పెద్ద పెద్ద పదాలు కూడా సులభంగా చదివే స్తోంది. టీవీల్లో వచ్చే తెలుగు పదాలు కూడా అనర్గంగా చదువుతోంది. నాకు చాలా సంతోషంగా ఉంది.

-సుమలత, విద్యార్థి తల్లి, సంజీవ్‌గాంధీ కాలనీ

➤ **తేడా కనిపిస్తోంది...**



మా పిల్లలు తెలుగు అంటే భయపడేవాళ్లు. 30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన బాలబాలికలు నేడు అనర్గళంగా చదవగలుగుతు న్నారు. భాస్కర్ రాజు ఇచ్చిన శిక్షణ ద్వారా బాగా తేడా కనిపిస్తోంది. విద్యార్థుల్లో 80% పైగా మాతృభాషపై పట్టు పెరిగింది. చిన్నపిల్లలు పదో తరగతి తెలుగు పుస్తకాలను చాలా ఈజీగా చదివేస్తున్నారు. ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది.

-ధనంజయులు నాయుడు, జెడ్‌పి స్కూల్, హెడ్మాస్టర్

➤ **మాతృభాషాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ**



మాతృభాష తెలుగు అంటే భయపడే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి సులభంగా తెలుగును అనర్గళంగా చదవగలిగేలా చేయాలనే సంకల్పంతో 18 స్టెప్స్ మెథడ్‌తో పాటు, కొత్తగా రూపకల్పన చేసిన ఫోర్ స్టెప్స్ మెథడ్‌తో మాతృభాషను ఈజీగా నేర్చుకోగలుగుతున్నారు. దీనిపై ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే ఒంగోలు, కడప, గుంటూరు లలో వెయ్యి మందికి పైగా ప్రైవేట్ పాఠశాలల మాతృభాష ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇచ్చాం. ఆన్లైన్ ద్వారా కూడా శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్తి వివరాలకు 8886800091, 8886800093 ఫోన్ నెంబర్లను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.

- సంగరాజు భాస్కర్ రాజు

వాడ వాడలా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం చంద్రబాబు దార్శనికుడని అఖిల భారతీయ యాదవ మహాసభ యువజన రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్ అన్నారు. ఆదివారం చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా అలిపిరి పాదాల మండపం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జోష్ ప్రాపర్టీ అధినేత ఈశ్వర్ ప్రకాష్, హరి, దిలీప్, నవీన్, చారు హాసన్, సాయి, శీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : చంద్రబాబు జన్మదిన వేడుకలు బాలయపల్లిలో టిడిపి సీనియర్ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ప్రెసిడెంట్ మస్తాన్ నాయుడు, జయంపు ఆయకట్టు ప్రెసిడెంట్ సీనియర్ నేత మన్నారు వెంకటరత్నం, టీడీపీ నాయకుల పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: చంద్రబాబుజన్మదిన వేడుకలను చిన్నగొట్టిగల్లులో కొట్టే శివకుమార్, ఆర్ వి రమణారెడ్డి, మునస్వామి నాయుడు తదితర టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పార్టీ నేతలు రెండు ముక్కలాటకు తెరలేపారు.ఆదివారం మండలంలో పలుచోట్ల ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు సీఎం జన్మదిన వేడుకలు జరుపుకోవడంపై నాయకుల ఐక్యత ప్రశ్నార్థకంగా మారింది. తొలత ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద మండల టిడిపి అధ్యక్షులు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఇదే తరహాలో స్టేట్ బ్యాంక్ ఆవరణ వద్ద టిడిపి నాయకులు ముని చంద్ర నాయుడు, రవి నాయుడు, కార్తీక్ నాయుడు తదితర టీడీపీ నాయకుల అధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు సూళ్లూరుపేట నియోజకవర్గ అబ్జర్వర్ కొండలరావు, మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీహరి రెడ్డి, ఇట్లగుంట రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోట: చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతి ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహంచారు. కోట మండలం, కారు స్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్‌అహ్మద్ టిడిపి సీనియర్ నాయకులు పలనాటి భాస్కర్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : చంద్రబాబు జన్మదిన వేడుకలు చంద్రగిరిలో టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ మూలస్థాన ఎల్లమ్మకు పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజారెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, బాలకృష్ణ, లోకాద్రి నాయుడు, సక్కూరి ధనుంజయరెడ్డి, మునిరత్నం రాయల్, లంకెల లలిత, సింగు సుధా, మాజీ జెడ్పిటిసి అమ్ములు, వినోద్ కుమార్ రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో.. మండల టిడిపి శాఖ ఆధ్వర్యంలో ప్రధాన కూడలి వద్ద కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జనార్దన్ చౌదరి, ఆరి లీలా మోహన్ నాయుడు, కొట్టే నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి, కోరా హరిప్రసాద్, దినేష్ చౌదరి, సి వెంకట ప్రసాద్, కే మధుసూదన్ రెడ్డి, చెరుకూరి రవికుమార్, కే రామిరెడ్డి, కే ధనంజయ రెడ్డి, సుగుణ, బాదురు కోటేశ్వర్ రెడ్డి, మహేష్ నాయుడు, లీగల్ సెల్ అధ్యక్షుడు మునె య్య, సురేంద్ర నాయుడు, భక్తవత్సలం నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

అనుపల్లెలో.. మాజీ ఎంపీపీ బిందు మాధవి, స్థానిక టిడిపి నాయకుల అధ్వర్యంలో అనుపల్లెలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకా దేవరాజులు, బండి విజయ్ కుమార్ రెడ్డి, బండి లీలా ప్రకాష్ రెడ్డి, పంతల వెంకటేష్ నాయుడు, జవ్వాది ప్రకాష్ యాదవ్, గజ్జల మహేష్, పంతల చిట్టిబాబు, యారం జవహర్ రాయల్, కె మధుసూదన్ రెడ్డి, పచార్ల జగదీష్. మహిళలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో రెడ్డివారి గురవారెడ్డి, ధనంజయులనాయుడు, శివ శంకర్ రెడ్డి, నైనారు పొన్నారావు, నాగరాజు నాయుడు, నాగూర్ నాయుడు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడులో గాంధీ విగ్రహం వద్ద మండల టిడిపి అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకలు చంద్రశేఖర్ నాయుడు, సమన్వయకర్త డాక్టర్ శ్రీపతి బాబు, మండల జనసేన అధ్యక్షుడు రూపేష్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చంద్రబాబు జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు శివయ్య, నరేంద్ర, శివకుమార్ తదితర టీడీపీ నాయకుల అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు బాల సుందరంరెడ్డి, మురళి (చికెన్ చిన్న) లోకయ్య రెడ్డి, అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ తదితర నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పూర్వవిద్యార్థుల సహకారంతో సీఎం చంద్రబాబు బాల్యమిత్రులు, సహచరమిత్రులతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, విద్యార్థి సంఘ నేతలు పాల్గొన్నారు.

యస్వీయులో.. తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడుని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత స్టేట్ స్పోక్స్ పర్సన్ రాం మోహన్, టీఎన్ఎస్ఎఫ్, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి ,అశోక్ కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు తెలుగు యువత స్టేట్ స్పోక్స్ పర్సన్ శేషాద్రి నాయుడు, పత్తిపాటి వివేక్, బషీర్, ప్రకాష్, రామంజి, పెద్దయ్య, పూర్ణచంద్ర, సోమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు జన్మదిన సందర్భంగా తిరుపతి ఎల్ ఎస్ నగర్, భ్రమరాంబికా శివాలయంలో తెలుగు యువతరాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, 22 డివిజన్ అధ్యక్షుడు అధ్యక్షుడు గుర్రం బాల ఆధ్వర్యంలో గణపతి హెూమం, ఆయుష్ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి సూర సుధాకర్ రెడ్డి టౌన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు పులిగోరు మురళీకృష్ణ రెడ్డి, టీవీ మురళీనాథ రెడ్డి, రామచంద్రారెడ్డి భాస్కర్ రెడ్డి ,నాగేంద్ర, మహమ్మద్ రఫీ, పెరుమాళ్ మధు, వెంకటేష్, హరి , అశోక్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో తిరుపతి, ఎం.ఆర్.పల్లి అన్న క్యాంటీన్ వద్ద చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎపి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊక విజయ్ కుమార్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, కోడూరు బాలసుబ్రమణ్యం, కృష్ణ యాదవ్, నగర అధ్యక్షులు చిన్నబాబు, కీర్తి, బ్యాంక్ శాంతమ్మ, అనిత యాదవ్, ఆనంద్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, ఎం.ఆర్.పల్లి టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదలియార్ కుటుంబాన్ని పరామర్శించిన రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ కన్వీనర్ ఏకాంబరం బంధువులు అప్పా దొరై మొదలియార్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రోజా ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుమారుడు వైసీపీ కార్యకర్త తిరుమలయ్యని ఓదార్చారు.ఆమె వెంట పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయ ప్రకాష్, శంకర్, మాజీ ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి, దిలీప్ కుమార్, ప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నారు

మా భూమిని రక్షించండి: మనోహర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని సర్వేనెంబర్ 3/2సి/2 లోని రెండు ఎకరాల తమ భూమిని శ్రీమన్నారాయణ రెడ్డి అనే వ్యక్తి మబ్బు దేవా నారాయణరెడ్డి అండతో కబ్జాకు యత్నిస్తున్నారని, భూమిని కాపాడుతూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీలేరుకు చెందిన మనోహర్ జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తమపై దాడికి ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేత్రాల పట్ల జాగ్రత్తలు వహించి కంటిచూపును కాపాడుకోవాలని సురేంద్ర కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎస్. సురేంద్ర సూచించారు. ఆదివారం శ్రీ బాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ హాస్టల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మెకానిక్స్, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం నిర్వహించారు. ఈ శిబిరంలో అసోసియేషన్ కార్యదర్శి హరిప్రసాద్, ఉపాధ్యక్షులు చందు, కోశాధికారి షఫీ, సంయుక్త కార్యదర్శి ఆనంద్, అడ్వైజర్ గోపి, మధు కుమార్, ప్రసాద్, జాకీర్, గోపి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతంలో విజ్ఞానాన్ని నేర్చుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రచారం కోసం అంకితమైన సంస్కృత భారతి సంస్థ, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న "స్ఫూర్తి సంగమం" అనే కార్యక్రమం విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా అఖిల భారతీయ సంఘ కార్యవాహ్ సురేష్ సోని విచ్చేసి సంస్కృత భాష ఆవశ్యకత, ఆధునిక కాలంలో సంస్కృతం భారతీయ సభ్య సమాజానికి ఒక మంచి మార్గాన్ని నిర్దేశించేటువంటి దిక్సూచి అని, సంస్కృతాన్ని ప్రతి ఒక్కరూ చదువుకొని అందులో ఉన్నటువంటి జ్ఞానాన్ని పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా.ఎం.జి.నందన్ రావు, డా.ఎస్.ఎల్ సీతారాం శర్మ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో సోషల్ వర్క్ కొనసాగించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో సోషల్ వర్క్ సబ్జెక్టును 2025-26 అకడమిక్ సంవత్సరంలో కొనసాగించాలని రాష్ట్ర సోషల్ వర్క్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి. వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. వర్సిటీ ఉపకులపతికి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సు ప్రభుత్వ శాఖలు, జాతీ య, అంతర్జాతీయ ఎన్జీఓలు, ఆసుపత్రులు, పరిశ్రమలు వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన సామాజిక కార్యకర్తల అవసరాన్ని తీర్చడంలో ప్రధాన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మహేంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో, ఎస్.ఏ.ఎల్.సి చర్చిలో ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ప్రశాంత్ కుమార్, ప్రవీణ్ రాజ్‌లు ఈస్టర్ విశిష్టతను తెలియజేశారు. గాంధీ నగర్ వద్ద ఉన్న క్రైస్తవ స్మశాన వాటికలో క్రైస్తవులు పెద్దల సమాధులవద్ద ప్రార్థనలు నిర్వహించారు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పుత్తూరు ఎన్జీవో కాలనీ, సిఎస్ఐ చర్చి, సంఘం, పెంతుకోస్తు సంఘం, ఈసీఐ, సంఘాలలో క్రైస్తవ సోదరులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సెల్వం ఈస్టర్ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సంఘ సభ్యులు విజయ్ కుమార్, జోష్, చిరంజీవి, ఐజాక్, మహిళలు. పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

గాయాల పాలైన శేషు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన ఘటన శనివారం అర్ధరాత్రి తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు వాగు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి పోతే కారకొల్లు పంచాయతీ శ్రీకృష్ణాపురం గ్రామానికి చెందిన శేషు(37) పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో ఉన్న ఓ బ్రాందీ షాప్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. శేషుకు అదే గ్రామానికి చెందిన గంగయ్య అనే వ్యక్తితో పది రోజుల కిందట గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న గంగయ్య ఏర్పేడు మండలం, ముసలిపేడుకు చెందిన తన అల్లుడుతో కలిసి శేషుపై దాడికి పథకం వేశాడు. ఈ క్రమంలో శేషు శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరిగి వస్తుండగా కాపు కాసి దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ శేషుని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఏఐబిఇఏ 80 వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టీబీఈసిసి ఆధ్వర్యంలో ఏఐబిఇఏ 80వ వ్యవస్థాపకదినోత్సవ సందర్భంగా తిరుపతిలోని పాస్ మనోవికాస్ కేంద్రంలోని పిల్లలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానకార్యదర్శి జె ధన్వంత్ కుమార్, అధ్యక్షులు విజయభాస్కర్ ప్రసంగించారు. ఏఐబిఇఏ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్వానా, ప్రభాత్కర్ నాయకత్వంలో బ్యాంకు ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఏఐబిఇఏస్థాపన జరిగిందని తెలిపారు. ఉద్యోగుల సర్వీస్ కండిషన్స్, ద్వైయపక్షిక చర్చల ద్వారా వేతన ఒప్పందం, పెన్షన్ సౌకర్యం, దేశ ప్రజల హితంకోసం బ్యాంకుల జాతీయకరణ, సభ్యులు గర్వించే నాయకత్వం ఏఐబిఇఏ సొంతం. ఎందరో నాయకులు, సభ్యుల ఆశయ సాధనకోసం. ఉద్యోగుల కళ్లల్లో ఆనందం వెల్లి విరియాలనే తపనతో ఏఐబిఇఏ పనిచేస్తోంది. బ్యాంకు ఉద్యోగుల అక్షయపాత్ర ఏఐబిఇఏ అని పేర్కొన్నారు. పిఎన్‌బి లో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, నరసింహులు, జనార్ధన్, నందగోపాల్, యగ్నేష్, సుమలత, రేష్మ, నిర్మల, మహేష్, పవన్, వెంకట రెడ్డి, లక్ష్మీపతి, బ్యాక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆముదాల ప్రభాకర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆముదాల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జగదీష్, కార్యదర్శిగా పరదాల మణి ఇతర కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్లో నగరంలోని రాజకీయ ప్రముఖుల, వస్త్ర వ్యాపారస్తుల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆముదాల ప్రభాకర్ మాట్లాడుతూ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారాల నిమిత్తం అనేక సంవత్సరాలుగా స్థిరపడి ఐక్యమత్యంతో ఉమ్మడి కుటుంబ సభ్యుల్లా ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వ్యాపారస్తులందరికీ అందుబాటులో ఉంటూ తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యవర్గ కమిటీ నన్ను నమ్మి అధ్యక్షుడిగా పట్టం కట్టారన్నారు. తిరుపతిలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్‌ను సముచితమైన స్థానానికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని, వ్యాపార వర్గానికి మరింత సేవలందిస్తానన్నారు. వ్యాపారస్తులు ఎప్పుడు పిలిచినా వారి సమస్యలపై స్పందించి పరిష్కార చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి , కార్పొరేటర్ పొన్నాల చంద్ర, బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, ఈ బీసీ కాలనీ, జై శిలువ ప్రార్థన మందిరంలో దైవ సేవకులు శాంతి బాబు పాస్టర్ వెంకీ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.

IN THE COURT OF THE PRINICIPAL SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) : TIRUPATI
I.A.No. 89/2022
I.A.No. 208/2019
O.S.No.635/2014

P.Balarami Reddy ... Petitioner/ Plaintiff
And
P.Venkatarama Reddy & Others
... Respondent / Defendants

R9: Boyapati Dhanjaya Chowdary, S/o. Boyapati Subbarayulu Naidu, D.No.20-1-416/18K, Subash Nagar, Tirupati, Tirupati Urban Mandal, Tirupati District.

9వ రెస్పాండెంటుకు నోటీసు

పై దావాలో 9వ రెస్పాండెంట్/ ప్రతివాదిగా చేర్చుటకు వాది పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు న్యాయస్థానం వారు 06-05-2025న 9వ రెస్పాండెంట్ హాజరు కొరకు వాయిదా వేసియున్నారు. కావున 06-05-2025న ఉ.10.30గం॥లకు మీరు గాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని సదరు న్యాయస్థానము వారు మీ పరోక్షమున తీర్మానము చేయగలరు.
వాయిదా : 06-05-2025

Ch.M.S.Raju,
Advocate, Tirupati

మహారాజశ్రీ గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.NO.461 / 2023, A.S.NO. 139 / 2016
అంగడి వెంకట క్రిష్ణయ్య మరియు ఇతరులు
...పిటీషనర్స్
Vs
కనకంబేడు మల్లికేశ్వర్ శెట్టి మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్

To
1. రెస్పాండెంట్ నెం.5
జయంతి, W/o నరసింహం, హిందు, వయస్సు సుమారుగా 43 సం॥లు, నెం.34, చిన్న మెటుపాళెం, 2 వ వీధి, తిరునత్తూర్, తిరువళ్ళూర్, తమిళనాడు రాష్ట్రం.
2. రెస్పాండెంట్ నెం.6
భాగ్యలక్ష్మి, W/o బాలాజీ, హిందు, వయస్సు సుమారుగా 45 సం॥లు, 63 F, కొత్తవీధి, కావడి వీధి, తిరునత్తూర్, తమిళనాడు రాష్ట్రం.

నోటీసు
పై నంబరు పిటీషనులో పిటీషనర్లు ఐదు మరియు ఆరవ రెస్పాండెంట్స్‌పై పిటీషను దాఖలు చేసినందున మీకు ఏవిధమైనా ఆక్షేపణలు వున్నయెడల పై కోర్టులో తేది 25-04-2025న ఉదయం 10.30 గంటలకు మీరు గానీ, మీ తరపున అడ్వకేటు గానీ హాజరై తెలుపకొనవలసినవి, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

ఇట్లు
కుడుముల రవికుమార్
పిటీషనరు తరపు అడ్వకేటు,
నెల్లూరు.

మహారాజశ్రీ గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.NO.462 / 2023, A.S.NO. 139 / 2016
అంగడి వెంకట క్రిష్ణయ్య మరియు ఇతరులు
...పిటీషనర్స్
Vs
కనకంబేడు మల్లికేశ్వర్ శెట్టి మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్

To
1. రెస్పాండెంట్ నెం.5
జయంతి, W/o నరసింహం, హిందు, వయస్సు సుమారుగా 43 సం॥లు, నెం.34, చిన్న మెటుపాళెం, 2 వ వీధి, తిరునత్తూర్, తిరువళ్ళూర్, తమిళనాడు రాష్ట్రం.
2. రెస్పాండెంట్ నెం.6
భాగ్యలక్ష్మి, W/o బాలాజీ, హిందు, వయస్సు సుమారుగా 45 సం॥లు, 63 F, కొత్తవీధి, కావడి వీధి, తిరునత్తూర్, తమిళనాడు రాష్ట్రం.

నోటీసు
పై నంబరు పిటీషనులో పిటీషనర్లు ఐదు మరియు ఆరవ రెస్పాండెంట్స్‌పై పిటీషను దాఖలు చేసినందున మీకు ఏవిధమైనా ఆక్షేపణలు వున్నయెడల పై కోర్టులో తేది 25-04-2025న ఉదయం 10.30 గంటలకు మీరు గానీ, మీ తరపున అడ్వకేటు గానీ హాజరై తెలుపకొనవలసినవి, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

ఇట్లు
కుడుముల రవికుమార్
పిటీషనరు తరపు అడ్వకేటు,
నెల్లూరు.